సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 5 । అక్టోబర్ । 2023



సవాళ్లను అధిగమిస్తేనే..

నూతన విద్యా విధానంపై అంబేడ్కర్ వర్సిటీలో రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. పలు అంశాలపై చర్చించారు. - 8లో



సమస్యల పరిష్కారమే లక్ష్యం

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొత్తూరులో బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహించారు. - 8లో

రేపు జాబ్‌మేళా

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి సాయి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి, పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివిధ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



లారీలో ఎగసి పడుతున్న మంటలు

సోంపేట: మండలంలోని కొర్లాం–లక్కవరం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. సకాలంలో డ్రైవర్ స్పందించి దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోయంబత్తూర్ నుంచి కోల్‌కతాకు టీ పొడి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. డ్రైవర్ ఖాదర్‌ఖాన్‌కు చిన్న గాయాలయ్యాయి. సోంపేట అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది విజయ్ కుమార్, రాంభద్రరావు, కె.వి.రమణ ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

పంటల వివరాలు సరి చూసుకోవాలి

గార: ఈ–క్రాప్ బుకింగ్‌లో భాగంగా ఈకేవైసీ సమయంలో విస్తీర్ణం, పంట వివరాలను రైతులు సరిచూసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం గార మండలం శ్రీకూర్మం, అంపోలు పరిసరాల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. రైతుల వారీగా సర్వేనెంబరు, విస్తీర్ణం, పంట సాగు, ఆధార్ వంటివి సరిపడింది లేనిదీ ఆరా తీశారు. సిఫారసు మేరకే ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జేడీఏ కె.శ్రీధర్, ఏడీఏ బగ్గు రజిని, ఏఓ డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

10, 11వ తేదీల్లో సాగర్ కవచ్



మెరైన్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో రెండు రోజుల పాటు కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్ – సాగర్ కవచ్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెరైన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎస్.బాలరాజుతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డ్రిల్‌కు అవసరమైన పోలీసు సిబ్బంది, వస్తు సామగ్రి, బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అక్టోబర్ 10, 11 తేదీల్లో సాగర్ కవచ్ జరుగుతుందన్నారు. ఎక్కడెక్కడ బందోబస్తు నియమించాలో ముందస్తుగా గుర్తించి అవసరమైన సిబ్బందిని కేటాయించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.బాలరాజు, కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.గోవిందరావు, బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ జె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యకృత్యంగా ధర్మ ప్రచారం



గోపూజ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అరసవల్లి: హిందూ సనాతన ధర్మాన్ని కాపాడే క్రమంలో ధర్మ ప్రచార వారోత్సవాలను నిర్వహించడం గొప్ప కార్యక్రమమని, ఇలాంటివి నిత్యకృత్యం కావాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. బుధవారం అరసవల్లిలో ధర్మప్రచార వారోత్సవాలను మంత్రి ప్రారంభించారు. ముందుగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈవో వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలు గౌరవ స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల నడుమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ అరసవల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, ఎన్.కోటేశ్వర చౌదరి, ద్వారపు అనూరాధ అజిత్ కుమార్, లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన..

ధర్మప్రచార వారోత్సవాల ప్రారంభం సందర్భంగా గోపూజ, త్రిచ, సౌర, అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు, వేదపారాయణ, ఉపనిషత్ పారాయణతో పాటు ధన్వంతరీ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక కాపువీధి శ్రీసూర్యతేజ కోలాటం బృందం, శ్రీఅభినయ నృత్యనికేతన్, విజయనగరం జిల్లా కర్లాంకు చెందిన తిరుమల శ్రీనివాస కోలాట బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తి గీతాలాపనలు అలరించాయి. ఈ నెల 10 వరకు వారోత్సవాలు జరగనున్నాయని అధికారులు ప్రకటించారు. భక్తులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఆరోగ్య భాగ్యం..!

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- ఖరీదైన రక్తపరీక్షలు సైతం ఉచితంగా నిర్వహించడంపై హర్షం
- కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ప్రత్యేక వైద్య సేవలు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఎన్నడూ లేని విధంగా స్పెషలిస్టు వైద్యులు వచ్చి ఆరోగ్య తనిఖీలు చేయడం, ఖరీదైన రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. ఇటువంటి సేవలు గతంలో ఎప్పుడూ చూడలేదని చెబుతున్నారు. ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో ఇటువంటి శిబిరాలు నిర్వహించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అన్నీ ఉచితంగానే..

ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ కోసం ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకోవాలంటే కనీసం రూ.250 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుంది. హెచ్‌బీఎస్ ఏజీ పరీక్షలు చేయాలంటే సుమారు రూ.400 చెల్లించాల్సి వచ్చేది. వీటితో పాటు ఆర్‌బీఎస్, హెచ్‌బీ, యూరిన్‌లో సుగర్ లెవల్స్, బీపీ తదితర పరీక్షలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అంతేకాకుండా ముందుగా వైద్యుడి వద్దకు వెళ్లి అక్కడ నుంచి ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అక్కడే స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి పక్కనే ఉన్న ల్యాబ్‌లో వివిధ రక్త పరీక్షలను చేయించుకోవడం, ఉచితంగా మందులు పొందడం మరింత సులభతరంగా మారింది. ఇదంతా పేద, సామాన్య వర్గాల ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారనే విషయం ప్రజలకు అర్థమవుతోంది.

ఖర్చులు తగ్గాయి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల పేదవర్గాలకు మంచి వైద్యం పల్లె ముంగిటకే లభిస్తుంది. దీని వల్ల పేదలకు వైద్యం ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి. ఆరోగ్య సురక్ష కార్యక్రమం బాగుంది.

– పలికల కుణితమ్మ, జాడుపూడి, కంచిలి మండలం



కంచిలి: జాడుపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన రోగులు



రణస్థలం: చిల్లపేటరాజాంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంతోషంగా ఉంది..




వృద్ధాప్య సమస్యల కారణంగా బయటకు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే కష్టంగా ఉండేది. ఇంతలో గ్రామానికే వచ్చి ఆరోగ్య తనిఖీలు చేశారు. మందులు కూడా ఇచ్చారు. కళ్లు తనిఖీ చేశారు.ఉచితంగా కళ్లద్దాలు ఇస్తామన్నారు. సంతోషంగా ఉంది.

– గొండు అప్పయ్య, జమ్ము, నరసన్నపేట మండలం



శ్రీకాకుళం రూరల్ : రాగోలులో వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

మూడుసార్లు రక్త పరీక్షలు..



శిబిరానికి వచ్చాక మూడు సార్లు రక్త పరీక్షలు చేశారు. గుండె, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకున్నాను. ఉచితంగా మందులు ఇచ్చారు. వాటిని క్రమం తప్పకుండా వాడమని చెప్పారు. బయట పెద్ద ఆస్పత్రికి వెళ్తే వేల రూపాయలు ఖర్చయ్యేవి. జగన్‌బాబుకి కృతజ్ఞతలు.

–పేడాడ రాములు, వీఆర్‌గూడెం, పొందూరు మండలం

ఎన్నడూ లేనివిధంగా..



సీఎం జగనన్న ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గ్రామానికే వైద్యులను తీసుకొస్తున్నారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇప్పిస్తున్నారు. అవసరమైన వారికి జిల్లా కేంద్రంలోని వైద్యులతో మాట్లాడి రిఫర్ చేస్తున్నారు. ఇంతకన్నా పేద ప్రజలకు అండగా నిలిచేదెవరు?

– సీహెచ్ రమ, చిల్లపేటరాజాం, రణస్థలం మండలం



సారవకోట: మాకువ సచివాలయంలో వైద్యశిబిరం

ఆరు నెలలుగా బాధపడుతున్నా..



నా రెండు కాళ్లు, మోచిప్పల సమస్యతో ఆరు నెలలుగా బాధపడుతున్నా. జగనన్న సురక్ష శిబిరం ఉందని మా వలంటీర్ ఇంటికి వచ్చి నాకు సమాచారం ఇచ్చారు. శిబిరానికి వెళ్లగా వివిధ రకాలు పరీక్షలు చేయించారు. రిమ్స్ ఆర్థోపెడిక్‌కు రిఫర్ చేయించారు. నొప్పి తగ్గేందుకు ప్రస్తుతం మందులు ఇచ్చారు. అంతా బాగుంది.

– ఎస్.సుందరనారాయణ, రాగోలు



బూర్జ: పెద్దపేట గ్రామ సచివాలయం వద్ద అందుబాటులో ఉంచిన మందులు



మెళియాపుట్టి: జలక లింగుపురంలో సేవలపై ఆరా తీస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు...



కొంత కాలంగా నరాలు, కంటి సమస్యలతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులను సంప్రదించగా మందులు ఇచ్చారు. అక్కడే ఉన్న కంటి వైద్యుడి వద్ద పరీక్షలు చేసుకోగా ప్రస్తుతానికి మందులిచ్చారు. మరో 6 నెలల తరువాత ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామన్నారు.

– బగాది మోహిని, పోలవరం, టెక్కలి మండలం

బుధవారం ఆరోగ్య సురక్ష ఇలా..

మండలాలు	హెల్త్‌క్యాంపులు
30	29
ఓపీలు	రిఫరల్స్
8894	387



టెక్కలి: పోలవరంలో వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గతంలో ఇలా లేదు..



నేను కంటి సమస్యలతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆసుపత్రి మాదిరిగా కంటి పరీక్షలు నిర్వహించి మందులిచ్చారు. నాకు తెలిసి ఇప్పటి వరకు మా గ్రామాల్లో పెద్ద ఎత్తున వైద్య శిబిరం నిర్వహించడం ఇదే మొదటి సారి.

– మెట్ట లోకనాథం, లచ్చన్నపేట, టెక్కలి మండలం

కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం



ఆశలు పండాయి..

నిధులు అందాయి


నిరీక్షణ ఫలించింది. ఆటల వేదిక ఆశలు పండాయి. జిల్లా మంత్రి కృషి కాసులు కురిపించింది. సుమారు ఏడాది క్రితం ఇక్కడే ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. జిల్లా ప్రధాన క్రీడల వేదిక కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనుల కోసం రూ.12 కోట్ల నిధులు విడుదలకు బుధవారం పరిపాలన అనుమతులు జారీ అయ్యాయి. దాంతో గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అర్థాంతరంగా నిలిచిపోయిన స్టేడియం ఆధునికీకరణ పనులకు మోక్షం కలిగింది. సర్వ హంగులతో త్వరలోనే స్టేడియం కళకళలాడనుంది.

- కోడి రామ్మూర్తి స్టేడియం పనులకు రూ.12 కోట్ల నిధులు విడుదల
- ధర్మాన కృషితో సీఎం జగన్ హామీ మేరకు నిధుల కేటాయింపు
- పరిపాలనాపరమైన అనుమతులు సైతం మంజూరు
- దశాబ్దకాలంగా క్రీడాకారులు పడుతున్న కష్టాలకు చరమగీతం
- గత ప్రభుత్వ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియానికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. స్టేడియం ఆధునికీకరణ పనులు మళ్లీ మొదలుకానున్నాయి. జిల్లాలో జరిగిన అమ్మఒడి పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవ వేదికగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. కేఆర్ స్టేడియంలో నిలిచిపోయిన పనులకు అవసరమైన రూ.12 కోట్ల నిధులను తాజాగా విడుదల చేశారు. ఈ మేరకు పరిపాలన అనుమతితో కూడిన జీవోను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన కృషి ఫలించినట్టు అయింది. దశాబ్దకాలంగా సరైన క్రీడామైదానం లేక క్రీడాకారులు పడుతున్న కష్టాలకు ఫుల్‌స్టాప్ పడనుంది.

గత పాలకుల శాపం..

1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతులమీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రారంభమైంది. మల్టీపర్పజ్ స్టేడియంగా అన్ని క్రీడాంశాలను ఆడేలా అవకాశం కల్పించారు. సుమారు 17 వేల మంది ప్రేక్షకులు పోటీలను తిలకించేలా గేలరీలను నిర్మించారు. మరికొన్నాళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్,



షటిల్ బ్యాడ్మింట్ వంటి ఇండోర్ క్రీడాంశాలకు ఉపయుక్తంగా కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. రవిశాస్త్రి, వెంకటపతిరాజు వంటి ఆటగాళ్లు ఈ మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆడారు. కాసింఖాన్, సుందరరావు, బాలమురళీ, కృష్ణదాస్ వంటి అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆటగాళ్లతోపాటు శ్రీకాకుళాన్ని ప్రపంచపటానికి పరిచయంచేసిన కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ వంటి క్రీడాకారిణులు ఓనమాలు దిద్దుకున్నది కోడిరామ్మూర్తి స్టేడియంలోనే. అంతటి ప్రఖ్యాతి గాంచిన స్టేడియం క్రమేపీ శిథిలావస్థకు చేరుకుంది. 2012–13లో నాటి మంత్రిగా ధర్మాన ప్రసాదరావు చొరవతో స్టేడియం ఆధునికీకరణ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. అవసరమైన నిధుల మంజూరు చేసే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడంతో ప్రతిపాదనలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ కాంట్రాక్టర్ల అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం స్టేడియం నిర్మాణాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. మొత్తమ్మీద గత పాలకుల పాపం క్రీడాకారులపాలిట శాపంగా మారిపోయింది.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యధోరణి..

2016 మే 2న నాటి సీఎం చంద్రబాబునాయుడు శిలాఫలకం వేసి వదిలేశారు. దాదాపు రెండేళ్ల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టుల కేటాయింపులో నాడు క్రీడల మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు అన్నీతానై చక్రం తిప్పారు. కమీషన్ల కోసం తమకు అనుకూలమైన వారికే కాంట్రాక్టు పనులు కట్టబెట్టారు. దీంతో ఆది నుంచి పనులు నత్తనడకనే జరుగుతుండేవి. సబ్ కాంట్రాక్టర్లకు నిధులు చెల్లింపులు చేయకపోవడం, కూలీలకు సైతం డబ్బులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అనేక సాంకేతిక సమస్యల కారణంగా పనులు తొందరగా మొదలుకాలేదు.

ధర్మాన కృషి.. సీఎం చొరవ..




2022 జూన్ 27న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. అమ్మ ఒడి మూడో విడత నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా చేపట్టారు. నాడు మంత్రి ధర్మాన ప్రసాదరావు అదే వేదికపై కోడిరామ్మూర్తి స్టేడియం దీనస్థితిని వివరించి, రూ.12 కోట్లు కేటాయించినట్టయితే క్రీడాకారుల కష్టాలు తొలగుతాయని వివరించగా.. సీఎం జగన్ నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కోడిరామ్మూర్తి స్టేడియంలో నిలిచిపోయిన పనులకు అవసరమయ్యే రూ.12 కోట్ల నిధులను జీవో ఆర్టీ నెంబర్ 202తో అక్టోబర్ 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. మొత్తం మీద అటు ధర్మాన చొరవ.. ఇటు సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు మరికొద్ది రోజుల్లో క్రీడాకారుల కష్టాలకు చెక్ పడనుంది.

త్వరలోనే పనులు..

ప్రభుత్వం కోడిరామ్మూర్తి స్టేడియానికి అవసరమైన రూ.12 కోట్ల నిధులను విడుదల చేయడం అభినందనీయం. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో పనులు ప్రారంభమవుతాయి. శాప్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – బీవీ ప్రసాదరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ

– డాక్టర్ శ్రీధర్‌రావు, చీఫ్ కోచ్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..



కోడిరామ్మూర్తి స్టేడియంలో నిలిచిపోయిన పనులకు రూ.12 కోట్ల నిధులతో పాటు పరిపాలనాపరమైన అనుమతులు లభించడం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సంతోషం వ్యక్తంచేశారు. నిధులు విడుదల చేసిన సీఎం జగన్‌కు, సమస్యను సీఎంకు వివరించిన తన సోదరుడు ధర్మాన ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒలింపిక్ సంఘ పెద్దలు, క్రీడాసంఘాల ప్రతినిధులు, స్కూల్‌గేమ్స్ ప్రతినిధులు, పీఈటీ సంఘ నాయకులు, పీడీ పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు వాకర్స్, తదితర వర్గాలు కూడా ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వం గాలికొదిలేసిన స్టేడియం పనులు పునఃప్రారంభించేందుకు చొరవ చూపడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేయాలని వారంతా కోరుతున్నారు.

జిల్లాకు మరో పరిశ్రమ

- రణస్థలం మండలం నారువ వద్ద 57 ఎకరాల్లో ఎన్‌ఏసీఎల్ ఫ్యాక్టరీ
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



ఫౌండేషన్ స్టోన్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పరిశ్రమ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్ఏసీఎల్(నాగార్జున అగ్రి కమ్ లిమిటెడ్) ఆధ్వర్యంలో జిల్లాలో మరో పరిశ్రమ ఏర్పాటు కానుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. పారిశ్రామికవాడ పైడి భీమవరం సమీపంలో రణస్థలం మండలం నారువ వద్ద 57 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉదయం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎన్ఏసీఎల్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 700 మందికి ఉపాధి కలుగుతుందన్నారు. విశాఖలో గతంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు ఈ పరిశ్రమ ఏర్పాటు కానుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ వరదరాజులు మాట్లాడుతూ 57 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 200 మందికి పరోక్షంగా 500 మందికి ఉపాధి కలగనుందని చెప్పారు. జీవ సంబంధ పదార్థాలతో ఆర్గానిక్ ఎరువులను తయారు చేయనున్నామని తెలిపారు. ఏడాదిన్నర వ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ఫౌండేషన్ స్టోన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఉమా మహేశ్వరరావు, ఎన్ఏసీఎల్ ఐఆర్ హెడ్ కె.శ్యామ్ ప్రసాద్, డీజీఎంలు పి.వి.ఎస్.ఎస్.ఎన్. వర్మ, వి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, అధికారులు చొరవ తీసుకోవాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ఉత్సవాల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే ఉత్సవాలకు సుమారు 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనికి అనుగుణంగా బందోబస్తు, ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, పీఏసీఎస్‌ అధ్యక్షుడు బాడాన మురళి, వెలమ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ దుంగ శిమ్మన్న, మండల పార్టీ కన్వీనర్‌ నూక సత్యరాజ్‌, సర్పంచ్‌లు కాళ్ల సంజీవరావు, ఆలయ కమిటీ చైర్మన్‌ బోయిన మాధవి, ఈఓ వి.రాధాకృష్ణ, తహసీల్దార్‌ జె.ఈశ్వరమ్మ, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్‌ఐ మహమ్మద్‌ అలీ, కల్లి లక్ష్మణరెడ్డి, కల్లి నాగయ్యరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

టెక్కలి రూరల్‌: మేజర్‌ పంచాయతీ టెక్కలి పరిధిలో బుధవారం రెండు మిస్సింగ్‌ కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ ఎల్‌.రామకృష్ణ తెలిపారు. టెక్కలి ఎన్టీఆర్‌ కాలనీకి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు బొంగు వెంకటమ్మ సోమవారం నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు నర్సింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకుందని, మరుసటి రోజు ఉదయం చూసేసరికి తన చేతికి ఉన్న 8 గాజులు, చైన్‌లు, బంగారం వదిలేసి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నిచోట్లా వెతికినా కనిపించలేదన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

బాలిక మిస్సింగ్‌..

స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన బాలిక రెండు రోజులుగా కనిపించడం లేదని ఆమె తండ్రి బుధవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్కలిలోని ఎస్వీఆర్‌కే జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ రెండో సంవత్సరం చదువుతున్న ఈమె సోమవారం రాత్రి ఇంట్లో పడుకుందని, ఉదయం చూసేసరికి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర హార్టికల్చర్‌ పాలిటెక్నిక్‌ విద్యార్థిని జీవిరెడ్డి నాగవరహా రమాదేవి నిరీష బీఎస్సీ హార్టికల్చర్‌ హానర్స్‌ డిగ్రీ ప్రవేశ పరీక్ష హార్టిసెట్‌–2023లో సత్తాచాటింది. 100 మార్కులకు గాను 82.50 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించింది. ప్రణాళికాబద్ధంగా చదవటం వల్ల ఈ ర్యాంకు సాధ్యమైనట్లు విద్యార్థిని తెలిపింది. ప్రిన్సిపాల్‌ జి.హర్షవర్ధన్‌, కళాశాల యాజమాన్య సభ్యులు విద్యార్థినిని బుధవారం అభినందించారు.

విద్యా ప్రమాణాలపై నాక్‌బృందం ఆరా



మౌలిక వసతులు పరిశీలిస్తున్న సభ్యులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్‌ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. నాక్‌ కమిటీ చైర్‌పర్సన్‌ టి.సి.తరనాథ్‌, కోఆర్డినేటర్‌ నాగేంద్ర అంబేడ్కర్‌ సోలే, సభ్యురాలు వి.సుజాత తదితరులకు ముందుగా కళాశాల ప్రిన్సిపాల్‌ టి.గోవిందమ్మ నేతృత్వంలో విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికారు. డిగ్రీ గ్రూపుల వివరాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, సాంకేతిక విద్య తదితర అంశాలను బృంద సభ్యులు సుదీర్ఘంగా పరిశీలించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ బి.సతీష్‌కుమార్‌, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ వి.ల్యూక్‌ పాల్‌, ఎ.రామారావు, కసవయ్య పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి.. పింఛన్‌ అందించి!



పింఛన్లు అందజేస్తున్న వలంటీర్‌ లక్ష్మణరావు

ఎచ్చెర్ల క్యాంపస్‌: మండలంలోని బడివానిపేటకు చెందిన దివ్యాంగుడు ఎండపల్లి భార్గవ్‌ విశాఖ పట్నంలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతనికి దివ్యాంగ పింఛన్‌, తల్లి పద్మావతికి వితంతు పింఛన్‌ను వలంటీర్‌ లక్ష్మణరావు బుధవారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

చికెన్‌

బ్రాయిలర్‌

లైవ్‌	డ్రెస్డ్‌	స్కిన్‌లెస్‌
₹140	₹235	₹ 255

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు

- విద్యారంగ మార్పులతో ఉత్తమ మానవ వనరులు
- జాతీయ సదస్సులో ఎన్‌సీటీఈ సభ్యుడు ప్రొఫెసర్‌ గంటా రమేష్‌
- నూతన విద్యా విధానంపై అంబేడ్కర్‌ వర్సిటీలో రెండు రోజుల సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న ఎన్‌సీటీఈ సభ్యుడు ప్రొఫెసర్‌ గంటా రమేష్‌

ఎచ్చెర్ల క్యాంపస్‌: విద్యలో మార్పులతోనే ఉత్తమ మానవ వనరులు సాధ్యమని న్యూఢిల్లీకి చెందిన నేషనల్‌ కౌన్సిల్‌ ఫర్‌ టీచర్‌ ఎడ్యుకేషన్‌ (ఎన్‌సీటీఈ) సభ్యుడు ప్రొఫెసర్‌ గంటా రమేష్‌ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విశ్వవిద్యాలయంలో విద్యావిభాగం, ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌ రీసెర్చ్‌ (ఐసీఎస్‌ఎస్‌ఆర్‌), యూనియన్‌ బ్యాంక్‌, సమగ్ర శిక్షల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నూతన విద్యావిధానం –2020 అమలు, వ్యూహాలు, సవాళ్లు అనే అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావిధానం, విద్యలో అంతర్జాతీయ మార్పులు అధ్యయనం చేశాకే నూతన విద్యావిధానం అమలు చేసినట్లు తెలిపారు. ఇందులో 5+3+3+4 విధానం అమలవుతుందని చెప్పారు. ఎర్లీఎడ్యుకేషన్‌, స్కూల్‌, హయర్‌, ప్రొఫెషనల్‌, ఒకేషనల్‌, టెక్నికల్‌, స్పెషల్‌ ఎడ్యుకేషన్‌లు అమలవుతాయని వివరించారు. విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, నిపుణులైన బోధన సిబ్బందిని నియమించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రయోగాలు, నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు.

- న్యూఢిల్లీకి చెందిన ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ వై.రమేష్‌ మాట్లాడుతూ ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, బోధన సిబ్బంది సమష్టిగా కృషిచేస్తేనే నూతన విద్యా విధానం అమలు సాధ్యమవుతుందన్నారు. మూడేళ్ల పాటు పరిశోధన, పరిశీలన అనంతరం ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. న్యాయస్థానాలు, పలు కమిటీలు సైతం గతంలో అనేక సిఫారసులు చేశాయని గుర్తు చేశారు.
- జిల్లా ప్రిన్సిపాల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి కె.శారదాంబ మాట్లాడుతూ నూతన విద్యావిధానం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జాతీయ విద్యా హక్కు చట్టం సైతం పటిష్టంగా అమలవుతుందని చెప్పారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.
- అంబేడ్కర్‌ విశ్వవిద్యాలయం వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ వర్సిటీలో నూతన విద్యావిధానం అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల డిగ్రీ బీఏ+బీఎడ్‌, బీఎస్సీ+బీఎడ్‌ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొత్త వర్సిటీ అయినప్పటికీ పరిశ్రమల అనుసంధానంతో ఉపాధి లక్ష్యంగా విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు.
- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం కరిక్యులమ్‌ పక్కాగా అమలు చేయడమే లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను ఈ విద్యావిధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం సావనీర్‌ విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యారంగ నిపుణులు ప్రొఫెసర్‌ పద్మనాభయ్య, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్‌, యూనియన్‌ బ్యాంక్‌ రీజనల్‌ హెడ్‌ ఎం.వెంకట్‌తిలక్‌ , ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ బి.అడ్డయ్య, సెమినార్‌ కన్వీనర్‌ డాక్టర్‌ హనుమంతు సుబ్రహ్మణ్యం, సహాయ కన్వీనర్‌ డాక్టర్‌ ఎస్‌.శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

వెలమ సంఘం బలోపేతానికి కృషి



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

గార: వెలమ సంక్షేమ సంఘం బలోపేతానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం అంపోలు జిల్లా జైలు సమీపంలో వెలమ సంఘానికి చెందిన 2.41 ఎకరాల స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన వారు అభివృద్ధి చెందుతూ మనం కూడా అందులో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం అడ్‌హాక్‌ కమిటీ ఏర్పాటు, సభ్యత్వ నమోదు వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌, ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, గుండ అప్పలసూర్యనారాయణ, బగ్గు రమణమూర్తి, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు, ముద్దాడ చినబాబు, పొన్నాడ గణేష్‌, చక్క నారాయణరావు, డీసీఎంఎస్‌ చైర్మన్‌ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీలు గొండు రఘురామ్‌, అంబటి శ్రీనువాసరావు, చిట్టి జనార్దనరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, వరదు విజయకుమార్‌, జరుగుళ్ల శంకర్‌, ముద్దాడ కృష్ణమూర్తి, దుంగ సుధాకర్‌, శిమ్మ రాజశేఖర్‌, చల్ల రవికుమార్‌, అంబటి రంగారావు, పెద్దింటి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప్‌ సప్తాహ్‌లో కుంటికోట ప్రొఫెసర్‌



పీఎం నరేంద్రమోదీ, అధికారులతో ప్రొఫెసర్‌ అనూరాధ

మందస: దేశంలోని వెనుకబడిన 112 జిల్లాల్లో కేంద్రం చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతగానో మార్పు తీసుకువచ్చిందని ప్రభుత్వం చెబుతోంది. దీనిలో భాగంగా మరో 100 బ్లాక్‌లు ఎంపిక చేసి అభివృద్ధి చేసే కార్యక్రమం సంకల్ప్‌ సప్తాహ్‌ దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రారంభమైంది. నీతి ఆయోగ్‌, ఎన్‌ఐఆర్డీ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఇందులో మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన ప్రొఫెసర్‌ పల్లా అనూరాధకు ప్రధానమంత్రితో పాల్గొనే అవకాశం కలిగింది. ఈమె హైదరాబాదులోని ఎన్‌ఐఆర్డీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నీతిఆయోగ్‌, ఎన్‌ఐఆర్డీ సంయుక్తంగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. బెస్ట్‌ ట్రైనర్‌గా ఎంపికైన తనతో ప్రధాని మాట్లాడుతూ ట్రైనింగ్‌ వివరాలు అడిగి తెలుసుకున్నారని ప్రొఫెసర్‌ అనూరాధ 'సాక్షి'కి బుధవారం చెప్పారు.

అదనపు పరిహారం అందుతుంది



వంశధార నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి వంశధార నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారాలను త్వరలోనే చెల్లిస్తారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి భరోసా ఇచ్చారు. బుధవారం కొత్తూరు మండలం గూనభద్ర అపోజిట్‌ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించేందుకు వచ్చిన ఎమ్మెల్యే రెడ్డి శాంతిని మెట్టూరు బిట్‌–3 కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సొంట్యాన తమ్మినాయుడు, పిన్నింటి శేషగిరిల సమక్షంలో నిర్వాసిత మహిళలు కలిసి సమస్యలు వివరించారు. ఇప్పటికే రూ.216 కోట్ల అదనపు పరిహారం చెల్లించామని, మరో రూ. 56 కోట్లు మాత్రమే అందజేయాల్సి ఉందన్నారు. నిర్వాసితులకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ప్రస్తుతం నిర్మించిన గృహాలకు బిల్లుల మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కొంత మంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా ఎమ్మెల్యే రెడ్డి శాంతి వెంటే ఉంటామని, సీఎంగా వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని గెలిపించుకుంటామని చెప్పారు.

ఉత్సవాలకు వేళాయె..!



బలగలోని నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు, ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు గణేష్‌ గురూజీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ సమయంలో మహానివేదనలు, హోమం, యంత్రపూజలు, ద్వాదశ హారతులు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు. – శ్రీకాకుళం కల్చరల్‌

పెదపాడు గురుకులానికి రూ.లక్ష విరాళం



ప్రిన్సిపాల్‌కు చెక్‌ అందజేస్తున్న దానేటి శ్రీధర్‌

శ్రీకాకుళం రూరల్‌: మండలంలోని పెదపాడు పరిధిలో డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ గురుకుల కళాశాల/పాఠశాలకు దానేటి శ్రీధర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ద్వారా డాక్టర్‌ దానేటి శ్రీధర్‌ బుధవారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ మొత్తంతో విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్లు కొనుగోలు చేయాలని ప్రిన్సిపాల్‌ జ్యోతికి సూచించారు. అనంతరం శ్రీధర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి చేరుకున్నానని, ప్రతిఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఓ బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం



నటరాజ్‌కు రూ.5.40 లక్షల చెక్‌ను అందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇందులో భాగంగానే ఇటీవల ఆరోగ్యశ్రీ పరిధిలో కొత్త వ్యాధులను చేర్చామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి స్వగృహంలో బుధవారం 13వ వార్డులో పోతనపల్లి వీధికి చెందిన జర్నలిస్ట్‌ బాడ నటరాజ్‌కు రూ.5లక్షల 40 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని మరికొన్ని కేసులను గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నటరాజ్‌ మాట్లాడుతూ తుంటి సమస్యతో 18 నెలలుగా మంచానికి పరిమితమయ్యానని, హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకునేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ మంజూరైందని, ఇందుకు కృషి చేసిన మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ లంబాల మధుసూదన్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మీసాల సురేష్‌బాబు, మాజీ కౌన్సిలర్‌ రోణంకి శాంతికుమారి, అంది రమాకృష్ణ, నల్లారి అశోక్‌కుమార్‌, నల్ల నారాయణ, గోరు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నెమళ్ల వేటపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ–భగీరథపురం గ్రామాల మధ్య పెద్ద కొండపై ఇటీవల కొందరు వేటగాళ్లు రాత్రిపూట నెమళ్లను వేటాడుతున్నారంటూ భగీరథపురం గ్రామస్తులు కోటబొమ్మాళి ఎస్‌ఐ షేక్‌ మహమ్మద్‌ అలీకి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన ఎస్‌ఐ భగీరథపురం కొండ వద్ద పోలీసులతో నిఘా ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గురువారం సమగ్ర విచారణ చేపడతామని, గ్రామస్తులు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

నేటి నుంచి జెమ్స్‌లో వార్షిక సమావేశాలు

శ్రీకాకుళం రూరల్‌: ఆంధ్రప్రదేశ్‌ మెడికల్‌ ఎడ్యుకేటర్స్‌–2023 అసోసియేషన్‌ 13వ వార్షిక సమావేశాలను రాగోలు జెమ్స్‌ ఆస్పత్రిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ డి.లక్ష్మీలత, కో చైర్మన్‌ డాక్టర్‌ హవిలా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెమ్స్‌ మెడికల్‌ కళాశాల ఆస్పత్రి చీఫ్‌ మెంటార్‌ డాక్టర్‌ బొల్లినేని భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వైద్య రంగంలోని నిపుణులు హాజరవుతారని తెలిపారు. అధ్యాపకులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం రూరల్‌ : డొంకూరు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తుండగా పలాస మండలం కోసంగిపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. అదే రోజు ఆటో డ్రైవర్‌ రమేష్‌ రౌతో మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన తిత్తి మాధవరావు(44) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈయనకు భార్య కొర్లమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జగనన్నకు చెబుదాం స్పందనలో జేసీ నవీన్‌



జేసీకి వినతి పత్రాలు అందిస్తున్న అర్జీదారులు

కొత్తూరు: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జాయింట్‌ కలెక్టర్‌ ఎం.నవీన్‌ ఆదేశించారు. కొత్తూరు మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం జేసీ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై అర్జీలు సమర్పించారు. మండల సమావేశంలో ఎంపీడీఓ ప్రొటోకాల్‌ పాటించడం లేదని పీఏసీఎస్‌ చైర్మన్‌ చింతాడ సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. వరదగట్ల నిర్మాణం కోసం సేకరించిన భూములకు పరిహారాలు చెల్లించకపోవడంతో భూములు విక్రయాలు జరగడం లేదని రైతులు వై.సంతోష్‌ కుమార్‌ ఫిర్యాదు చేశారు. మెట్టూరు బిట్‌–1కి చెందిన బర్రి చంద్రశేఖర్‌కు భూములు లేకపోయినా బ్యాంకు ఖాతాకు రూ. 5.87 లక్షలను అదనపు పరిహారంగా ప్రభుత్వం తప్పుగా జమ చేసిందని అదే ప్రాంతానికి చెందిన బూర్లె శ్రీనివాసరావు జేసీకి ఫిర్యాదు చేశారు. ఈ సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ చక్రవర్తిని జేసీ ఆదేశించారు. నగదు ఇవ్వని పక్షంలో క్రిమినల్‌ కేసు నమోదు చేయాలన్నారు. మొత్తమ్మీద వివిధ సమస్యలపై 149 వినతులు అందినట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్‌ కలెక్టర్‌, నూరుల్‌ కామర్‌, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ జయదేవి, సీఈవో రావాడ వెంకటరామన్‌, ఏఎస్పీ తిప్పేస్వామి, డీపీవో రవికుమార్‌, తహసీల్దార్‌ చక్రవర్తి, ఎం.పావని, ఈవోపీఆర్‌డీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలే ప్రధాన అజెండా



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందిస్తున్న సంఘ సభ్యులు

అరసవల్లి: జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ఏపీ పీఆర్‌ మినిస్టీరియల్‌ జెడ్పీ యూనిట్‌ సంఘం ప్రాధాన్యమిస్తుందని జెడ్పీ యూనిట్‌ అధ్యక్షుడు దుంపల అప్పన్న తెలిపారు. జిల్లా పరిషత్‌ ఆవరణలో బుధవారం యూనిట్‌ సంఘ మొదటి కౌన్సిల్‌ సమావేశం నిర్వహించారు. పలు కీలక నిర్ణయాలను చర్చించి తీర్మానాలు చేశారు.అనంతరం తీర్మానాలు, వినతులతో కూడిన పత్రాన్ని సీఈఓకు అందజేశారు. కార్యక్రమంలో యూనిట్‌ ప్రధాన కార్యదర్శి రామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మానపు సంతోష్‌కుమార్‌, కార్యవర్గ సభ్యులు దేవేంద్రవర్మ, సోమేశ్వర పాడి పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం స్వాధీనం



బియ్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

సోంపేట: స్థానిక పెద్దకోమటి వీధిలో సానా మల్లేశ్వరి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 45 పీడీఎస్‌ బియ్యం ప్యాకెట్లను రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌ఓ కార్యాలయానికి వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఇచ్ఛాపురం, పలాస, సోంపేట సీఎస్‌డీటీలు సంతోష్‌, రవి, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



పొడుగు నవ్య (ఫైల్‌)

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్‌ మొదటివీధిలో పొడుగు నవ్య (25) అనే వివాహిత అనుమానాస్పదంగా బుధవారం రాత్రి మృతి చెందింది. బాత్‌రూమ్‌లో కాలిన గాయాలతో నవ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట ఏఎస్‌ఐ మస్తాన్‌, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. నవ్యకు నరసన్నపేటకు చెందిన పొడుగు సంతోష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కుమారుడు(జితిన్‌) ఉన్నాడు. వివాహమైనప్పటి నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్త, ఇతర కుటుంబ సభ్యులు వేధించే వారని, వారే నవ్యను కిరోసిన్‌ పోసి చంపేశారని మృతురాలి తల్లిదండ్రులు నారాయణశెట్టి లక్ష్మి, గోవిందరావు ఆరోపిస్తున్నారు. నవ్యే కిరోసిన్‌ పోసుకొని ఆత్మహత్య చేసుకుందని అత్త హేమలత, భర్త పొడుగు సంతోష్‌ చెబుతున్నారు. స్థానికులు మాత్రం నవ్యది హత్యేనని అంటున్నారు.

సమష్టి కృషితోనే హోటల్స్‌ సమస్య పరిష్కారం

- రాష్ట్ర హోటల్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆర్‌.వి.స్వామి
- జిల్లా, నగర హోటల్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం (పీఎన్‌ కాలనీ): రాష్ట్రంలో హోటలర్స్‌ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరమని రాష్ట్ర హోటల్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌.వి.స్వామి, మెట్ట నాగరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌ హాల్లో బుధవారం జిల్లా, నగర హోటలర్స్‌, రెస్టారెంట్‌, బేకర్స్‌, ఫంక్షన్‌ హాల్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అర్ధరాత్రి వరకు హోటల్స్‌ నడుపుకొనే అవకాశం ఉండేదని, ఇప్పుడా సమయాన్ని తగ్గించటం, పన్నులు, ధరలు పెరిగిపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధికి దృష్టి సారించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలసి హోటలర్స్‌ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నో రంగాల వారికి న్యాయం చేస్తున్నారని హోటలర్స్‌కు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. హోటల్‌ రంగాన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల్లో(ఎంఎస్‌ఎంఈ) చేర్చాలనికోరారు. ఇలా చేయడం వల్ల మిగిలిన పరిశ్రమల తరహాలోనే ప్రభుత్వం నుంచి రాయితీలు వస్తాయని, బ్యాంకర్ల నుంచి సహకారం అందుతుందని చెప్పారు. విద్యుత్‌ చార్జీల్లో యూనిట్‌కు రూపాయి రాయితీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎగ్జిక్యూటివ్‌ కార్యదర్శి ఎస్‌.హనుమంతురావు, కోశాధికారి పి.వి.పూర్ణచంద్రరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్ర, ఎగ్జిక్యూటివ్‌ కార్యదర్శి రఘువీర సేనై, 13 జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..

శ్రీకాకుళం జిల్లా సంఘం అధ్యక్షుడిగా బస్వా శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సువ్వారి వెంకట సతీష్‌, ఉపాధ్యక్షులుగా గవరయ్య, ఉన్న వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్‌ కార్యదర్శిగా పి.బి.ఎస్‌ వర్మ, కోశాధికారిగా గొల్లపల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా పి.వెంకటేష్‌, తుమ్మగుండ శంకర్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా పి.వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, పీఆర్వోగా టంకాల కృష్ణలను ఎన్నుకున్నారు.

నగర కార్యవర్గం..

శ్రీకాకుళం నగర సంఘం అధ్యక్షునిగా అంధవరపు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శిగా వి.సుదర్శన్‌, ఉపాధ్యక్షులుగా అరవల సతీష్‌కుమార్‌, టంకాల కృష్ణ, ఎగ్జిక్యూటివ్‌ కార్యదర్శిగా జి.నాగరాజు, కోశాధికారిగా కె.భవానీశంకర్‌, సంయుక్త కార్యదర్శిగా కె.గణపతి, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా రాణ సతీష్‌, హర్ష, మణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.